క్లుప్తంగా

పాత గుంటూరు ఎస్‌హెచ్‌ఓగా వెంకటప్రసాద్



పట్నంబజారు: నగరంలోని ఈస్ట్ సబ్ డివిజన్ పాత గుంటూరు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా కె.వెంకటప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన పల్నాడు, గుంటూరు జిల్లాలతో పాటు ఎస్‌ఐగా పనిచేశారు. 2024లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన పల్నాడు జిల్లాలో సైబర్ క్రైమ్ సీఐగా పని చేశారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా వెంకటప్రసాద్‌ను నియమిస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వై.వీరసోమయ్యను వీఆర్‌కు పంపించారు.

సుందరయ్యకు ఘన నివాళి



లక్ష్మీపురం: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శనేత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య అని భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ డొంక రోడ్ జోన్ ఆఫీస్‌లో సభ మంగళవారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీవెనరావు మాట్లాడుతూ సుందరయ్య ఆశయాలను కొనసాగించడమే వారికి ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించి తన జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. శాసన సభ్యునిగా పార్లమెంటు, సభ్యునిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురికిపూడి సారథి, జాన్ బాబు, ప్రేమానందం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రోజమ్మ పాల్గొన్నారు.

వందేభారత్‌లో వసతులు డొల్లా..



లక్ష్మీపురం: వందేభారత్ ప్రయాణికులకు సమస్యలు తప్పడం లేదు. తిరుపతి– సికింద్రాబాద్ వెళ్లే రైలులో సాంకేతిక సమస్యలు రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. 20702 తిరుపతి– సికింద్రాబాద్ రైలు సోమవారం గుంటూరు రైల్వే స్టేషన్‌కు రాత్రి 7.40 గంటలకు చేరింది. చైర్‌కార్ భోగిలో సిలింగ్‌లో నుంచి ఏసీ నీరు కారుతుండటంతో దాన్ని తక్షణమే మరమ్మతులు చేయించి ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాల్సింది పోయి సిలింగ్‌లో కాగితాలు పెట్టారు. అయినా సిలింగ్‌లో నుంచి ఏసీ నీరు కారుతునే ఉంది. అలాగే భోగిలో దోమలు, నల్లులు తిరుగుతున్నాయని ప్రయాణికులు చెప్పడంతో దోమలు ఉన్నచోట్ల హిట్ స్ప్రే చేస్తున్నారు.

ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో పెట్టుబడి పేరుతో మోసం

లక్ష్మీపురం: మొబైల్ ఫోన్‌లో ఓ మెసేజ్ ద్వారా ఆన్‌లైన్ రేటింగ్ పేరుతో ఓ బాధితుడు నుంచి రూ.19 లక్షలుపైగా నగదు ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెట్టించి మోసం చేసిన ఘటనపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. మెడికల్ కళాశాల రోడ్డులోని రైల్వే క్వాటర్స్ ప్రాంతానికి చెందిన అభిరామ్, ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. మార్చి 7వ తేదీన అభిరామ్ మొబైల్ ఫోన్‌కు యక్సోటికా వెబ్ సైట్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక మొత్తంలో లాభాలు పొందవచ్చని మెసేజ్ వచ్చింది. దీంతో అభిరామ్ యక్సోటికా వెబ్‌సైట్‌ను పరిశీలించగా ఈ వెబ్ సైట్ ఆన్‌లైన్ రేటింగ్ సంస్థ అని పెట్టుబడి పెట్టిన వారికి కమీషన్ రూపంలో అధిక లాభాలను వస్తాయని ఉంది. దీంతో నమ్మిన అభిరామ్ ముందుగా రూ.10 వేలు పెట్టుబడి పెట్టడంతో దాంతో రూ.16 వేలు నగదు వాపసు చేశారు. మళ్లీ రెండు సార్లు కూడా రూ.10 వేలు చొప్పున పెట్టుబడి పెట్టడంతో రూ.16 వేలు లాభంతో నగదు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. దీంతో పూర్తిగా నమ్మిన అభిరామ్ పలు దఫాలుగా సుమారు రూ.10 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. అయితే మొదట్లో వచ్చిన విధంగా లాభ డబ్బు వాపస్సు పంపించకపోవడంపై పలు మార్లు సంస్థకు సంబంధించిన ఆన్‌లైన్‌లో మాట్లాడటంతో దీనికి ఒక 50 మందికి పైగా గ్రూప్ సభ్యులు ఉంటారని విడతల వారిగా వరస క్రమంలో నగదు వస్తుందని చెబుతూ కాలయాపన చేయడం ప్రారంభించారు. అభిరామ్ రూ.19 లక్షల నగదు అప్పులు చేసి బంగారం తాకట్టు పెట్టి తెచ్చి ఇవ్వడంతో ఆందోళన చెందుతూ సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన మరుక్షణమే అభిరామ్ ఖాతాను నిలుపుదల చేయడంతో అభిరామ్ ఖాతాలో కేవలం రూ.90 వేలు మాత్రమే ఉన్నట్లు వాటిని ఆ వెబ్ సైట్ సంస్థ నగదు తీసుకోకుండా నిలుపుదల చేశారు. దీంతో అభిరామ్ దిక్కుతోచక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గొట్టిపాడు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. కిశోరి వికాసంలో భాగంగా మంగళవారం లింగ వివక్ష, అసమానతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్లన్నీ జలమయం



మూడు వంతెనలు వద్ద వర్షం నీటిలో వాహనదారుల ప్రయాణం



కొత్తపేట భగత్ సింగ్ బొమ్మ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీరు

నెహ్రూనగర్: నగరంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు చిన్న చెరువులను తలపిస్తున్నాయి. కమర్షియల్ ప్రాంతాల్లో రోడ్లు మీద మురుగునీరు నిలబడటంతో చేసేదేమి లేక అందులో వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మూడు వంతెనలు, కొత్తపేట, శారదాకాలనీ, నెహ్రూనగర్, పాత గుంటూరు, తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి మురుగునీరు చేరింది. డ్రెయిన్లలో మురుగునీరు సక్రమంగా పారుదలకాకపోవడంతో ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిపై నగర పాలక సంస్థ అధికారులు స్పందించి డ్రెయిన్లలో పూడిక తీత పనులు సక్రమంగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

టీడీఆర్ బాండ్లు అందించేందుకు చర్యలు

నెహ్రూనగర్: నగరంలో రోడ్ల విస్తరణ సమయంలో స్థలాలకు నగరపాలక సంస్థ గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు అందించడం జరుగుతుందని, అందని వారు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌ని కలిసి వివరాలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలోని డొంక రోడ్, కొత్తపేట, కుష్టర్ హాస్పిటల్ రోడ్, ఏటీ అగ్రహారం, పలకలూరు రోడ్, నందివెలుగు రోడ్, రామనామ క్షేత్రం రోడ్, జేకేసీ కాలేజ్ రోడ్ తదితర రోడ్ల విస్తరణ పనులు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగా విస్తరణ ప్రభావిత భవన స్థల యజమానులకు టీడీఆర్ బాండ్లు అందిస్తామని, కాని కొందరు గతంలో విస్తరణ చేపట్టిన రోడ్లకు సంబంధించి బాండ్లు అందలేదని పీజీఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీలు అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారు కార్యాలయ సమయంలో నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ రాంబాబు (98499 08390)ని కలసి తగిన వివరాలు అందిస్తే పరిశీలించి బాండ్లు అందించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో వీధి వ్యాపారుల నుంచి అనధికార ఆశీలు వసూలు చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారులకు సూచించారు. స్ట్రీట్ వెండింగ్ పాలసీపై సందిగ్ధం! అనే కథనం 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు కౌన్సిల్ సమావేశ మందిరంలో స్ట్రీట్ వెండింగ్ కమిటీ సభ్యులతో, నగర పాలక సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పీవీకే నాయుడు మార్కెట్, కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్, బండ్ల బజార్(ఫ్రూట్ మార్కెట్) ప్రాంతాల మినహా నగర పాలక సంస్థ అధికారికంగా ఎక్కడా ఆశీలు వసూలుకు టెండర్లు ఇవ్వలేదన్నారు. పై ప్రాంతాలు మినహా నగరంలో వీధి వ్యాపారులు ఆశీలు పేరుతో ఎవరైనా నగదు వసూలు చేస్తే, రాత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆక్రమణల తొలగింపులో రాజకీయ జోక్యం ఉండబోదని, అధికారులు విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ వెండింగ్ కమిటీ గుర్తించిన ప్రాంతాలలో వీధి వ్యాపారుల కోసం గ్రీన్, ఎల్లో, రెడ్ జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే సచివాలయ కార్యదర్శుల ద్వారా వీధి వ్యాపారుల సమగ్ర సర్వే జరుగుతుందని, వారం రోజుల్లో జోన్ల ఏర్పాట్లపై కమిటీ సూచనల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. వెండింగ్ కమిటీలో వీధి వ్యాపారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారని, అందరికీ ఆమోదయోగ్యంగా ప్రాంతాలను జోన్లగా ఏర్పాటు చేస్తామన్నారు. వెండింగ్ జోన్లకు అవసరమైన ప్రాంతాలలో అంగీకారం తెలిపిన ప్రైవేట్ స్థలాలను కూడా అద్దె ప్రాతిపదికన తీసుకుంటామని వివరించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగ మల్లేశ్వర రావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు బొడ్డుపల్లి స్మిత పద్మజ, ఈరంటి వరప్రసాద్, సంకూరి శ్రీనివాస రావు, షేక్ మీరావలి పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గని

లక్ష్మీపురం: రాష్ట్రంలో కళాకారులు దుర్భర జీవితం గడుపుతున్నారని, కళాకారులను ఆదుకోవాలని ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం ప్రజానాట్యమండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం అవుతున్న ఇంతవరకు కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా పెన్షన్లు ఇవ్వలేదని వెంటనే కళాకారుల సమస్యల పరిష్కరించాలన్నారు. సామాజిక సమస్యలపై రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాలు గుంటూరులో మే 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో శిక్షణ శిబిరాలు నెలకొల్పి ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రజానాట్యమండలి ముందుకు సాగుతుందన్నారు. ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ కళాకారుల సమస్యలపై కూటమి ప్రభుత్వం త్వరగా స్పందించాలని, 50 సంవత్సరాలు దాటిన వృద్ధ కళాకారులకు త్వరితగతిన పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

లక్ష్మీపురం: జూలై 9న జాతీయ సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మే 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మె దేశ యుద్ధ వాతావరణ పరిస్థితి దృష్ట్యా జూలై 9కు మార్పు చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకష్ణమూర్తి కోరారు. శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం కార్మిక, రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, రాధాకష్ణ మూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలుకు సిద్ధం చేశాయని, ఇవి కార్మికులను కట్టు బానిసలుగా చేసేందుకు సిద్ధం చేస్తూ, కార్పొరేట్లకు ఊడిగం చేసేందుకు సిద్ధం చేసేందుకు లేబర్ కోడ్లు తీసుకొస్తున్నారు అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాసరావు, పశ్చిమ అధ్యక్షులు బి.సత్యనారాయణ, మెడికల్ రిప్రజెంటేటీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.ఫణి, అబ్దుల్ సలీం, సీఐటీయూ గ్రామిక మహిళ కన్వీనర్ జి.రమణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కోట మాల్యాద్రి, జగన్నాధ రావు, సీఐటీయూ నాయకులు ఎం.రాజేశ్వరరావు, ఆది నికల్సన్, శ్రీనివాసరావు, రంగా, ఖాసిం వలి, కళ్యాణి, ముస్తాక్, శ్రీను పాల్గొన్నారు.

జంతు ప్రేమికులు సహకరించాలి

నగర మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరంలో వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి జంతు ప్రేమికులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జంతు ప్రేమికులు, అధికారులతో కలిసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో వీధి కుక్కల వలన సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల వలన ఎదురవుతున్న సమస్యలపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత పద్ధతిలో చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలకు జంతు ప్రేమికులు సహకరించడంతో పాటు, సూచనలను రాత పూర్వకంగా అందించాలని చెప్పారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వీధి కుక్కలను పట్టుకోవటం, ఏబీసీ చేయడం, ఏబీసీ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి మూడు ప్రధానాంశాలు ఉంటాయన్నారు. ఏబీసీని నిపుణులైన వైద్యులే చేయాలని మిగిలిన రెండు అంశాల నిర్వహణలో జంతు ప్రేమికుల సంస్థలు కూడా భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, వీఏఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఉపా సెల్ పీఓ రామారావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

ఎంసీ చాగ్లా జీవితం ఆదర్శప్రాయం



శిశిరంలో గులాబీలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: భవిష్యత్ తరాలకు ఎంసీ చాగ్లా జీవితం ఆదర్శప్రాయమని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.జి.శంకర్ అన్నారు. జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ తెలుగు అనువాదకులు కందిమళ్ల శివప్రసాద్ తెలుగులోకి అనువాదించిన శిశిరంలో గులాబీలు(ఎంసీ చాగ్లా ఆత్మకథ) పుస్తకావిష్కరణ సభ మంగళవారం లక్ష్మీపురం ఆంధ్రప్రదేశ్ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. గ్రంథావిష్కరణను అన్నమయ్య గ్రంథాలయ స్థాపకులు లంక సూర్యనారాయణ ఆవిష్కరించారు. విశ్రాంత న్యాయమూర్తి(ఉమ్మడి ఏపీ హైకోర్టు) జస్టిస్ డాక్టర్ కె.జి.శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం తరువాత కేంద్ర మంత్రిగా, సుప్రీం కోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా అనేక సంచలనాత్మక తీర్పులు వెలువరించిన గొప్ప న్యాయమూర్తి అని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు మాట్లాడుతూ చాకుల గొప్ప రాజకీయ దురంధరుడు అని అన్నారు. అనువాదకుడు శివప్రసాద్, చాగ్లా వ్యక్తిత్వాన్ని, ఆయన సుదీర్ఘ చరిత్రను తన శిశిరంలో గులాబీలు పుస్తకం ద్వారా వివరించారని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వామపక్ష ఉద్యమాల నేపథ్యంలో తెలుగులో అనువాద సాహిత్యం వెలువడిందని అన్నారు. ప్రస్తుత తరుణంలో అనువాద సాహిత్యం తగ్గిపోవడం విచారకరమని పేర్కొన్నారు. అనువాద అకాడమీ ఏర్పాటు చేస్తే గొప్ప అనువాదాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నెల్లూరి సత్యనారాయణ, ప్రసిద్ధ కథా రచయిత కె.దయానంద్, ప్రజాసాహితీ దివికుమార్, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి సత్యనారాయణ, మోదుగుల రవికృష్ణ, జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ ప్రతినిధి కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

న్యాయస్థానం తీర్పును అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను అమలు చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు వై.సాంబయ్య, టి.నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. చట్టప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్.కె ఖాసిం, గురవయ్య, నాగేశ్వరరావు, సుభాని, ఇస్మాయిల్, ఇమాంబి, దుర్గ, శివకుమారి పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి నృత్య నీరాజనం

చేబ్రోలు: చేబ్రోలులోని వీరాంజనేయస్వామి ఆలయంలో 41వ హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక కోనేరు వద్ద గల సువర్చల సమేత వీరాంజనేయస్వామి దేవస్థానంలో సాంస్కృతిక కళా వేదిక ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన చేశారు. పోలం రేవ్యశ్రీ, రుషిక, ఇంటూరి హాసిని, మద్ది హరిత ప్రియ, పునర్విక, మేఘనలు వివిధ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ చిన్నారులను ఘనంగా సత్కరించారు.

సివిల్ సప్లయి కార్మికులకు పని భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న అంజిబాబు

లక్ష్మీపురం: సివిల్ సప్లయిస్ కార్మికులకు పని భద్రత కల్పించి సొంత గోదాము నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు కోరారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. యూనియన్ నాయకులు సంపతి వెంకటకృష్ణ అధ్యక్షత వహించారు. అంజిబాబు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక భాగస్వామిగా పనిచేస్తున్న ముఠా కార్మికులకు సంబంధించి నెల బిల్లులు మళ్లీ నెల వచ్చేదాకా అందటం లేదని పేర్కొన్నారు. నెల బిల్లులను త్వరితగతిన కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయి ఉన్న యూనిఫాంను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో దానం, అశోక్ రెడ్డి, నీలం రామారావు, ప్రసాదు, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబుకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె కన్నబాబుకు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ఆయన్ను కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2017లో రాష్ట్రంలోని మున్సిపల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న నాన్ పీహెచ్ ఉద్యోగులకు అప్పటి రాష్ట్ర కార్మిక శాఖ జాయింట్ కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ చేసిన సిఫార్సు ప్రకారం స్కిల్డ్, సెమీ స్కిల్డ్, వేతనాలు చెల్లించాలని, రూ.21 వేల జీతం కంటే ఎక్కువ జీతం పొందుతున్న ఉద్యోగులకు ఈఎస్ఐ వర్తించదు కాబట్టి వారందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేసి సంవత్సరానికి 30 మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని, ప్రమాదవశాత్తు లేక అనారోగ్యంతో మరణించిన ఉద్యోగుల కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇతర పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

జూన్ 2న కలెక్టరేట్ వద్ద ధర్నా

నెహ్రూనగర్: ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం జరుగుతుందని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసీ పెంచలయ్య తెలిపారు. మంగళవారం శారదాకాలనీలోని గోపాలకృష్ణయ్య యానాది కాలనీలో యానాదులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో దాదాపు 10 లక్షల యానాదుల జనాభా ఉన్నారన్నారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో అత్యధిక జానాభా యానాదులు ఉన్నారని, గిరిజన జాతులలో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు నేటికి అన్ని విధాలా వెనుకబడి ఉన్నారని చెప్పారు. సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఎస్సీ వర్గీకరణ మాదిరి ఎస్టీ వర్గీకరణ కూడా చేసి యానాదులకు ఉద్యోగ, రిజర్వేషన్ పరంగా న్యాయం చేయాలన్నారు. ఎస్టీ వర్గీకరణ సాధనకై జూన్ 2వ తేదిన గుంటూరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య, జిల్లా అధ్యక్షులు బాకుల మురళీ, ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, చైర్మన్ కొమరగిరి చెంచయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావూరి రాజు, పొన్నూరు అంకమ్మ రావు, చేవూరు సుబ్బారావు, చెంబేటి ఉష, జున్ను కళ్యాణి, కృష్ణవేణి, చిల్లకూరు శశిరేఖ, పొట్లూరు రమణమ్మ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష నాగవల్లీ దళార్చన



నగరంపాలెం: స్థానిక పాతగుంటూరు విశాఖ శ్రీశారదాపీఠ పరిపాలిత శ్రీవీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో వీరాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు మంగళవారం మూడో రోజుకి చేరాయి. ఉదయం కంకణ ధారణ, గణపతి హోమం, లక్ష్మీనారాయణ హోమం, ఆంజనేయ హోమం, సుందరకాండ హోమం నిర్వహించారు. అనంతరం లక్ష నాగవల్లీ దళార్చన వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, సభ్యులు ఆత్మ కూరి లక్ష్మణరావు, సురేంద్ర కుమార్, తవ్వా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష మల్లెల పూజ

నగరంపాలెం: కొత్తపేట(నాజ్‌కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంత్యుత్సవాలు మంగళవారం కొనసాగాయి. ఉదయం పంచామృత స్నపన, అనంతరం స్వామికి లక్ష మల్లెల పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మంగళవారం కావడంతో మరింతగా భక్తుల రద్దీ నెలకొంది. హనుమాన్ దీక్షా సమాజం అధ్యక్షులు తిరువళ్లూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించగా, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి టి.సుభద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో దీక్షా సమాజం సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రహ్మణ్యం, బాపిరాజు పాల్గొన్నారు.

మానవ మేధకు కృత్రిమ మేధ సవాల్

ఎన్ఐసీ విశ్రాంత డైరెక్టర్ జనరల్ సీఎస్ఆర్ ప్రభు



సీఎస్ఆర్ ప్రభును సత్కరిస్తున్న ఎలైట్ ఫోరం ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ మేధకు సవాల్ విసిరే స్థాయికి కృత్రిమ మేధ చేరుకుంటోందని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ విశ్రాంత డైరెక్టర్ జనరల్ సీఎస్ఆర్ ప్రభు పేర్కొన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గుంటూరు ఎలైట్ ఫోరం ఆధ్వర్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో కృత్రిమ మేధ సామాజికంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దాని ప్రభావంపై సదస్సు నిర్వహించారు. ప్రభు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో భవిష్యత్‌లో మానవ మనగడకే ప్రమాదం సంభవించనుందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ మేధను కృత్రిమ మేధ దాటవేసి మానవులను తన ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నించే సందర్భంలో ఘర్షణ ఏర్పడే ప్రమాదముందని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ ఫేక్ అనేక రంగాలను ప్రభావితం చేసే దిశగా దుండగులు ఉపయోగిస్తున్నారని, దీనిపై రెగ్యులేటరీ అథారిటీ అనేది తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఏఐ రంగాలు ప్రభావితం అవుతున్నాయనే విషయంపై ఆచితూచి అడుగు వేసేదిగా ప్రభుత్వం కఠిన చర్యలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధతో పాటు మిషన్ లెర్నింగ్‌పై తాను రాసిన పుస్తకాలను పరిచయం చేశారు. ఏఐతో రాబోవు రోజుల్లో ఎంతో మంది ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదముందని, అయితే కొత్త ఉద్యోగాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, ఎలైట్ ఫోరం ప్రతినిధులు సింగం లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్వీ రమణ, డాక్టర్ కాకాని పృథ్వీ రాజ్ పాల్గొన్నారు.